


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"**పరిశోధన** ముందుకు సాగడంలేదు నాన్నగారూ. గులాబో చెప్పిన వాళ్ళు ఒక్కళ్ళు కూడా దొరకలేదు. అసలు వాళ్ళ ఉద్దేశ్యం ఏమిటో కూడా తెలీడంలేదు. ఇప్పటికే ఘోరమైన అరాచకాల్ని సృష్టించారు. ఇంకా ఇంకా సృష్టించి నగరాన్ని శాశ్వతంగా నాశనం చెయ్యాలనా? వారికొచ్చే లాభం ఏమిటీ? సరే, కొంతమంది హిందువుల్ని చంపుతారు. అక్కడితో హింస ఆగదుగా. అన్ని మతాలవారూ మృత్యువు ముంగిటే నిలబడాలిగా! వ్యథతో అన్నాడు ఎస్.పి వాసుదేవ్.

"వాసూ.. ప్రతి అరాచకం వెనుక కొంత స్వార్థం ఉంటుంది.కొందరు నాయకులూ వుంటారు. వారి లక్ష్యాలు వారివి. జీవితం కేవలం చిన్నదనీ, అది శాశ్వతం కాదనీ తెలుసుకున్న వారు జీవితాన్ని శాంతంగా గడపాలనుకుంటారు. మిగతా వారికి జీవితాన్ని గురించిన అవగాహన వుండదు. ధనం, పదవీ కాంక్షలతో మొదలైన స్వార్థం అక్కడితో ఆగక నా మతం, నా దేవుడు అనే స్థాయికి పెరుగుతుంది. అక్కడ కూడా ఆగక, ఎదుటి మతాన్నీ దేవాలయాల్నీ భూస్థాపితం చెయ్యాలన్న ఎత్తుకి ఎదిగి, అరాచకాల్ని సృష్టిస్తుంది. అమాయకుల ప్రాణాల్ని బలితీసుకుంటుంది. ఈ 'బలి' ఇప్పటిది కాదు. చిత్రం చూడు. ఒకే మతంలో వున్న శాఖలవారు కూడా తన్నుకుంటూ తిట్టుకుంటూ ఇతర శాఖలవార్ని నాశనం చెయ్యాలని చూస్తారు. ఒకే దైవాన్ని నమ్మేవారే ఇలా ఎందుకు చేస్తారంటావూ? 'మతం' అనే మాటకి అర్థం తెలీక,

అవగాహన లేక. పరిశోధనకి కావాల్సింది ఓర్పు. పులిని వేటాడే వేటగాడికి ఎంత ఓర్పు ఉండాలో అంత ఓర్పుకావాలి" సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చారు పుండరీకాక్షయ్యగారు. సుదీర్ఘంగా నిట్టూర్చాడు వాసుదేవ్.

"ఈ మధ్య హాజీ ముస్తఫిజుర్ గారిని ఏమైనా కలిశావా?" అడిగారు పుండరీకాక్షుడు.

"లేదు నాన్నగారూ.. కలవాలి" అన్నాడు ఎస్.పి వాసుదేవ్

"హాజీ చాలా మంచివాడు వాసూ. అతనెప్పుడూ నమ్మింది మతాన్నికాదు, మానవత్వాన్ని, అక్కడికి వెడితే ఏదన్నా క్లూ దొరకొచ్చు. దాదాపు రెండునెలలయిందిగదా, అరాచకాలు జరిగి, అరాచకాలు జరిపిన దుండగులు వెంటనే కలుగుల్లోకి పోతారు. హడావిడి సద్దుమణిగాక మెల్లగా బయటికొస్తారు. ఇవాళ హాజీగార్ని కలువు" అన్నాడు పుండరీకాక్షుడు. మౌనంగా తలవూపాడు వాసుదేవ్.

"పూరీ, ఉప్మా, కూరా, చట్నీలు కేరేజీలో పెట్టాను. మధ్యాహ్నానికి పులిహోర పెరుగన్నం తయారు చేసి పెట్టాను. అబ్బాయ్ అచ్యుతా పచ్చిమిరపకాయలు బజ్జీలు కూడా దండిగా పెట్టాను. హాయిగా పులిహోరలో నంజుకోండి. ఒక్క మెతుకు పారేసినా ఒట్టే" అంటూ పెద్ద వైరు బుట్టలో పెట్టిన హాట్‌పేక్‌లని ఇచ్చింది సౌభాగ్యలక్ష్మిగారు.

ఎస్.పి వాసుదేవ్ పెదవుల మీదకో చిరునవ్వు వొచ్చింది.

"అమ్మా.. నీ మాటలు చాలే. నేలమీద పడివున్న వారిని కూడా హిమాలయం ఎక్కిస్తాయి" ప్రేమగా అని, ఆవిడ చేత బొట్టుపెట్టించుకుని జీపు ఎక్కాడు వాసుదేవ్. జీపు స్టార్ట్ చేశాడు అచ్యుతనారాయణ.

"నారాయణా.. డైరెక్టుగా ముందు గులాబో దగ్గరికీ తరువాత హాజీ సాబ్ దగ్గరికి పోనీ" అన్నాడు వాసుదేవ్.

"వాళ్ళు మళ్ళీ కనపడలేదయ్యా. కానీ మరో బేచ్ సందేహాస్పదంగా తిరుగుతోంది. వీళ్ళు నార్త్ ఇండియన్స్ కారు. వాళ్ళ భాష తమిళంకీ మళయాళంకీ మధ్యస్థంగా వుంది. గుంపుగా తిరగడంలేదు. ఒకరొకరూ ఇద్దరిద్దరుగా యీ ప్రాంతాన్ని గమనించడాన్ని నేను గమనించాను. వాళ్ళను చూస్తే చాలా అమాయకులుగా అనిపించారు. వాళ్ళ చూపులు మాత్రం పట్టిచ్చాయి. వాళ్ళు నేరగాళ్ళనీ క్రూరులనీ" టీ ఇచ్చి మెల్లగా అన్నది గులాబో.

పోలీస్ జీప్ ఆగినందుకు జనాలు అప్పటికే గమనించారు.

టీ తాగాక అందరికీ కనిపించేట్టే పర్సు తీసి డబ్బులు ఇచ్చాడు వాసుదేవ్, "జాగ్రత్త గులాబో ఏ చిన్న క్లూ అయినా సరే, నబీ తోటి కబురు చెయ్యి" అని మెల్లగా అన్నాడు. జీపు బయలుదేరింది.

"ఓహ్.. గులాబో.. ఎస్.పిలు కూడా నీ దగ్గరికొచ్చి టీలు తాగుతున్నారంటే, నీ లెవెల్ ఏ రేంజికి పెరిగిపోయిందో తెలుస్తోందే. కుర్రాడికి పెళ్ళికూడా కాలేదుగా" వెకిలిగా నవ్వి అన్నాడు వీధులు తుడిచే మునిసిపల్ స్వీపర్ నారప్ప.

"నువ్వన్న మాటని కూడా ఆ బాబుకి చెప్పనా! సంతోషిస్తాడు. చిన్నగా నవ్వి అన్నది గులాబో. నారప్ప తెలిసినవాడే. పరమ సోమరి. ఊడ్చేసిన తరవాత చూసినా ఎక్కడి చెత్త అక్కడే ఉండేంత నేర్పరి. నోరు మంచిది కాదు గనక ఇతర వర్కర్లు అతనికి దూరంగా వుంటారు.

"దీనమ్మ నా పెళ్ళాంతోటే సస్తావుంటే, ఇదొకటా! వద్దుతల్లో వద్దు అయినా ఎవరెక్కడ టీ తాగితే నాకెందుకూ" మొహం మాడ్చుకుని బయలుదేరాడు నారప్ప. చిన్నగా నవ్వుకుంది గులాబో.

"అక్కా పోలీసాయన ఏమడిగాడూ?" అడిగాడు పళ్ళబండి రామేశం.

"ఏమడుగుతారు. టీ ఇచ్చాను. తాగారు. వ్యాపారం ఎలా వుందని మామూలుగా అడిగారు" అన్నది గులాబో.

"వ్యాపారం ఎలా వుందని అడగడానికి ఆయనేమన్నా మీ బంధువా స్నేహితుడా? నువ్వేదో ఆయనకి చెప్పావు. డబ్బులిస్తూ ఆయన ఏదో నీకు చెప్పాడు. గమనించలేదనుకున్నావా? ఏం చెప్పాడో తెలిస్తే మేమూ జాగ్రత్త పడతాంగా. కొట్లు మూయించేస్తాడా?" అడిగాడు రామేశం.

"ఆయన దయగల వాడురా రామేశం. ఎవరి పొట్టా కొట్టడు. ధైర్యంగా వుండు" అంటూ వచ్చిన కస్టమర్‌కి టీ కలపడం మొదలెట్టింది గులాబో. రామేశం సైలంటయ్యాడు. గులాబో చెప్పదని అతనికి అర్థం అయింది.

"గులాబో.. మనం మనం చిల్లర వ్యాపారస్తులం ఏదన్నా మనం మనం చూసుకోవాలి. పెద్ద వాళ్ళతో స్నేహం అంత మంచిది కాదేమో!" అన్నాడు రామేశం.

"రామేశం నువ్వు నన్ను అక్కా అని పిలుస్తావు. అవునా?" అన్నది గులాబో రామేశం వంక సూటిగా చూస్తూ.

"అవును. అందులో సందేహంలేదు. జన్మంతా నిన్ను అక్కగానే చూస్తాను" స్థిరంగా అన్నాడు రామేశం.

"అలాంటప్పుడు నిశ్చింతగా వుండు. ఆ బాబు వచ్చింది మన వ్యాపారాల్ని మూయించడం కోసం మాత్రం కాదు" స్పష్టంగా చెప్పింది గులాబో.

ఆమె మదిలో ఆ తమిళ మలయాళ సంకరభాష మాట్లాడిన వారే కదులుతున్నారు. రెండు నెలల క్రితం వచ్చిన బిహారీలూ గుర్తున్నారు. ఒక్కొక్క బేచీ దిగుతోంది. ఏదో చేస్తోంది. మళ్ళీ వెళ్ళిపోతోంది. అసలు వీళ్ళు కాంటాక్టు చేసేది. ఎవర్నీ? ఎందుకూ? మత కలహాలు సృష్టించడం కోసమా? స్కూటర్ బాంబులూ టిఫిన్ బాక్సు బాంబుల్ని పేల్చి జనాల్ని కకావికలు చేయడం కోసమా? గులాబో తలలో వెయ్యి ఆలోచనలు తిరుగుతున్నాయి.

**శిథిలాలయం**

"స్వామీ.. అందరూ వెళ్ళిపోయారు. మీరు ఇక్కడే వుండటానికి నిశ్చయించుకున్నారు. ఆహారంగా మీకు ఏది కావాలో. చెబితే ఆ ఏర్పాట్లు నేను చూసుకుంటాను. అయ్యా, మాది భిల్లజాతి. నాగరికతకి కొంచెం దూరం. నా మాటల్లో ఏదన్నా తప్పు అనిపిస్తే క్షమించాలి" వినయంగా అన్నాడు నీలుడు సంకల్పానందతో, చిన్నగా నవ్వారు సంకల్పానంద.

"నాయనా నేనూ అగ్రకులం వాడిని కాదు. కుమ్మరిని. చదివింది ఉజ్జయనిలో యజ్ఞనారాయణ మిశ్రా వారి గురుకులంలో వారు చెప్పారు, యజ్ఞ యాగాదులు  ఏ కులపువారైనా చెయ్యవచ్చుననీ, చేయించవచ్చునదీ. ఇది వారి భిక్షే. ఓ నీలుడా, యీ లోకంలో ఏది యోగం? ఏది యాగం? ఈ ఉచ్ఛ్వాస, నిశ్వాసాలకు మించిన యోగ విద్య ఇంకేదయినా వుందా? ఆ విద్య తెలియని జీవి యీ సృష్టిలో వుందా? నీవు అగ్రకులం వాడివి కాదన్నావు. నేను అగ్రకులంవాడినా? అసలు అగ్రకులం, నిమ్న కులం అంటే అర్థాలు ఏమిటీ? ఎలా   నిర్ణయిస్తారూ? ఎవరు నిర్ణయిస్తారూ? ఉన్నతమైన ఆలోచన, ఆచరణ కలిగిన వారే అగ్రకులస్తులు. లోపల ద్వేషం పగ అసూయ క్రోధం మదం మాత్సర్యం పెట్టుకున్న వారు అగ్రకులస్తులు ఎలా అవుతారూ? కులం నిర్ణయంపబడేది మనిషి ప్రవర్తనవల్ల. నీ మాటలు విజ్ఞతలో కూడుకున్నాయి. నీ ప్రవర్తనలో   స్వచ్ఛమైన వినయం వుంది. అన్నిటికంటే నీలో గొప్పగుణం ఏదంటే ఇతర్ల గురించి ఆలోచించడం ఆ ఆలోచన లేకపోతే నా ఆహారం గురించి  అసలీ ప్రశ్నే అడగవుకదా. బంధూ.. ఈ అడవిలో సులభంగా లభించే ఫలాలు కందమూలాలు చాలు నాకు. నాయనా ప్రవృత్తిని వదిలి నివృత్తి బాట పట్టడానికే ఇక్కడ వుండిపోవడానికి నిర్ణయించుకున్నాను. "సుదీర్ఘమైన సంభాషణ జరిపాడు సంకల్పానంద.

"చాలా సంతోషం స్వామీ. తప్పక ఆ ఏర్పాట్లు చేస్తాను. ప్రతిరోజూ నేనే వస్తాను. ఒకవేళ నేను రాకపోతే నా కూతురు దమయంతి వస్తుంది. అయ్యా నా కూతురి పెళ్ళి జరిగి ఆరునెలలయింది. అల్లుడు నా మేనల్లుడే" వినయంగా చెప్పాడు నీలుడు.

"చాలా మంచిది నీలా. అయినవాళ్ళకి బిడ్డనిస్తే అందరూ సుఖపడతారు" చేయెత్తి నీలుడ్ని ఆశీర్వదించి అమ్మవారి విగ్రహం వైపు నడిచి వెళ్ళాడు సంకల్పానంద.

అమ్మవారి ముఖం వేపనూనె దీపాల వెలుగులతో కళకళలలాడిపోతోంది. అమ్మవారి ముఖమేకాదు రంగుల శిలకూడా రకరకాల వెలుగుల్ని ప్రసరిస్తోంది. ఓ చల్లనిగాలి నీలుడ్ని తాకింది. అప్రయత్నంగా నీలుడు నేలమీద పడుకుని సాష్టాంగ నమస్కారం చేశాడు. అతనికి సాష్టాంగ నమస్కారాలూ సూర్య నమస్కారాలు నేర్పించింది శృంగి దగ్గర శృంగితో బాటు నీలుడికి మట్టూ కూడా జ్ఞాపకం వచ్చాడు.  వారి స్నేహం మనసులో మెదిలి అతని కళ్ళు చెమ్మగిల్లాయి. ముగ్గురూ ఎంత స్నేహంగా వుండేవారూ. అతని ఆలోచనలు సాగుతుండగానే గాలి కొంత తీవ్రతని సంతరించుకుంది. వర్షం పడుతుందా? అనుకుంటూ లేచాడు నీలుడు.

"నా జీవితంలో అత్యంత సుఖకరమైన రోజులు నీతోనే, నిన్ను కోరుకున్న తరవాతే మొదలయ్యాయి శ్రీనూ. అంతకుముందు కూడా కష్టాలైతే లేవు. మా అమ్మ అనూపవతి మమ్మల్నందర్నీ చక్కగా ఏ లోటూ లేకుండా పెంచింది. చదివించింది. చదువుతోబాటు సత్ప్రవర్తనా నేర్పింది. కానీ, తల్లిదండ్రులు ఎవరో తెలియని అనాధననే బాధ అప్పుడప్పుడూ వుండేది. నీతో వివాహం జరిగాక, అమ్మ నీడలో వుంటున్నాక అనాధననే ఆలోచనే లేదు సరికదా ఓ అనిర్వచనీయమైన ఆనందం నిరంతరం నా మనసులో ఉబికి వస్తోంది. అమ్మ ఎంత మంచిదీ. ఆవిడ ప్రేమే ఆవిడ భాష. అణువణువునా ప్రేమే" ఓ తన్మయత్వంతో అన్నది శరద్వతి. "ఔను శరద్వతీ.. ముమ్మాటికీ నిజం. నేనూ అనాధననే విషయం నాకు తెలీకుండానే అమ్మ పెంచింది. ఆ విషయం నాకు తెలుసన్న విషయం అమ్మకి తెలిస్తే బాధతో మెలి తిరిగిపోతుంది. అందుకే నేనేనాడూ ఆ విషయం ఎత్తలేదు. ఎత్తను కూడా, ఎక్కడి తిరుపతిలో పెరిగిన నేనూ, ఎక్కడి కురుక్షేత్రంలో పెరిగిన నువ్వూ.. వింధ్య పర్వతాల ఒడిలో కలిశాం. కంటికి కనిపించని విలియమ్స్ మనం వివాహం చేసుకోడానికి కారణమయ్యాడు. పరమేశ్వర శాస్త్రిగారూ, యజ్ఞప్పగారు వంటి వయోవృద్ధులే గాక జయదేవ్, రాబీ, రామజోగి మదాలస సుదర్శన్ వంటి శ్రేయోభిలాషులు మనని దీవించారు. ఎంత అదృష్టం" శరద్వతి చేతిని చేతిలోకి తీసుకుని అన్నాడు శ్రీనివాస్.

"నాయనా అమ్మవారికి ప్రసాదంగా చక్కెర పొంగలీ, అన్నం పరవాణ్ణం, బూరెలు చేశానురా. తీసుకురానా" అన్నది శ్రీనివాస్ తల్లి.

"లేదమ్మా మేమే వస్తాం. అయినా ఇవాళ పూజ చేసేంత విశేషమైన రోజు కాదే" అన్నాడు శ్రీనివాస్.

"మీ కడుపునో కాయ కాస్తే తొమ్మిది వారాలు పూజలు చేస్తానని మొక్కుకున్నా. ఇది మొదటి పూజ" నవ్వి అన్నది తల్లి.

కానీ ఆమెకే కాదు, శ్రీనివాస్‌కీ శరద్వతికీ కూడా తెలీదు, శరద్వతి గర్భంలో ఓ నలుసు ప్రాణం పోసుకుంటోందని.

"ఈ రోజు ఒక చిత్రమైన రోజు. మంచి చెడులకు అతీతమైన రోజు. ఎన్నో సంవత్సరాల తరువాత అరుదుగా వచ్చేరోజు. పగలూ రాత్రి సరి సమానంగా వుండే రోజు. విచిత్రం ఏమంటే యీ రోజు పక్షులు ఆహారం ముట్టవని పెద్దలు చెబుతారు. వాటికి మరి ఎలా తెలుస్తుందో ఏమో? నేను చాలాసార్లు అనుకునేవాణ్ణి నా జీవితంలో ఈ రోజు చూస్తానా అని" యజ్ఞప్పగారు మదాలసతో అన్నారు.

వారిద్దరూ హార్స్‌లీ హిల్స్‌కి ఆ ముందు రోజే తిరిగొచ్చారు. రావడానికి ముందు చాలా చర్చలు జరిగాయి. జయ్ రాబీ చెన్నైకి వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డారు. రెండు వారాల తరవాత మాత్రమే రాబీకి ఫ్లైట్ టిక్కెట్ దొరికింది. ఆ రెండు వారాలూ అతను రమణాశ్రమం తిరువణ్ణామలై)లో వుంటానన్నాడు.

సుదర్శన్ భట్టాచార్య బెంగుళూర్ వెళ్తానన్నాడు. అతను ఏదో చెప్పాలని చెప్పలేక మదనపడటం మదాలస గమనించింది. "మిమ్మల్ని పంపించాక నేను వెళ్తాను" అని సుదర్శన్ పట్టుబట్టాడు. ట్రైన్ ఎక్కించినప్పుడు అతని కళ్లలో చెమ్మని మదాలస గుర్తించింది. పరమేశ్వర శాస్త్రిగారూ రామజోగీ  అందరి నిర్ణయాలూ వింటూ మౌనం వహించారు. వారెక్కడికి వెళ్తారో, అసలు వెళ్ళరో ఎవరికీ చెప్పలేదు.

"నా గురించి మీరందరూ మీ అమూల్యమైన సమయాన్ని వెచ్చించినందుకు థాంక్స్. ఇండియా యాజ్ ఏ మిస్టిక్ లాండ్ అన్నమాట నూటికి నూరుపాళ్ళూ నిజం. నేను అమెరికన్‌ని. మా జీవితాలు ప్రాక్టికల్‌గా గడుస్తాయి. మీ జీవితాలు ఊహామయం. రాయిని దేవుడంటారు. చెట్టుని దేవుడంటారు. కోతినీ, పులినీ సగం సింహాన్నీ, చేపనీ తాబేలుని కూడా దైవంగానే భావిస్తారు. చిత్రం ఏమంటే, వాటికిచ్చే విలువ మనిషికి ఇస్తారో లేదో మీకే తెలియాలి" కొంచెం వ్యంగ్యంగానే అన్నాడు రాబీ.

"అవును. అందుకే ఏనాడూ చూడని మిమ్మల్ని గుళ్ళో తెలుగులో అరిచి పడిపోతే ఇన్నాళ్ళు జాగ్రత్తగా చూసుకున్నాం. 'మహాభారత ఆయుధాలు' అని మీరు కలలోగా అరవగానే మరింత జాగ్రత్తలు వహించాం. స్పృహలో లేనప్పటి సంగతి మేం చెప్పినా మీకు అర్థం కాదుగా, మిస్టర్ రాబీ, మేం రాళ్ళనీ రప్పల్నీ పూజించే పిచ్చివాళ్ళమే. కానీ, ఒక్కటి మాత్రం నిజం. మీ అమెరికన్స్‌లాగా ఇలా మేం ధన్యవాదాలు వెయ్యి జన్మలెత్తినా చెప్పి సెలవు తీసుకోలేము" సీరియస్‌గా అన్నాడు శ్రీనివాస్ – తెలుగులో.

"మీ మాటలకు అర్థం తెలీకపోయినా అవి కత్తుల్లా నన్ను గుచ్చుతున్నమాట నిజం. మే..బీ నేనలా మాట్లాడకూడదేమో. మే.బీ మీ జీవితాల గురించి విమర్శించకుండా  వుంటే బాగుండేదేమో. ఆ 'ఇఫ్'లూ 'బట్'లూ పక్కన పెడితే "Its time I shoukd take leave of you" నిర్లిప్తంగా శ్రీనివాస్‌తో కరచాలనం చేసి అన్నాడు రాబర్ట్ వెబ్‌స్టర్. "ఆ ... ఇంకో మాట కూడా చెప్పాలి. మాబ్రదర్ ఎడ్డీ అంటే ఎడ్వర్డ్ వెబ్‌స్టర్ రమణాశ్రమం తప్పక చూడమనీ, అక్కడి ఫోటోలు పంపమనీ పదే పదే చెప్పాడు. అందుకనే అక్కడికి వెడుతున్నా అన్నాడు జయ్... మరోసారి నీ హెల్ప్ కావాలనుకుంటా" జయ్ వంక చూస్తూ అన్నాడు రాబీ.

"ష్యూర్ రాబీ. తప్పక కారు ఎరేంజ్ చేస్తా" అన్నాడు సుజయ్. ఈ అనిశ్చిత స్థితిలోంచి బయటికి వెళ్ళడం అనే విషయం అతనికి చాలా ఆనందం కలిగించింది. ఫేమిలీని  విడిచి నెలలైంది. జయ్ వున్నది పరమేశ్వర శాస్త్రిగారి మీద వున్న గౌరవంతో మాత్రమే అని అందరికీ తెలుసు.

అందరూ శరద్వతికీ శ్రీనివాస్‌కీ ధన్యవాదాలు చెప్పారు. శ్రీనివాస్ తల్లికి భక్తిగా నమస్కరించారు. ముఖ్యంగా మదాలస.

అందరూ నిష్క్రమించారు. రామజోగీ, పరమేశ్వర శాస్త్రిగారూ శృంగి, మట్టు, డాక్టర్ తిరువీధి నారాయణాచార్యులుగారి తోటలోని గెస్ట్‌హౌస్‌కి వెళ్ళారు. డా.టి.వి.ఎన్ గారి ఆహ్వానంతో.

"ఈ సంఘటనలు అన్నీ ఎందుకు జరిగాయో తెలుసా? మన వివాహం జరగటానికి" అందరూ వెళ్ళాక పట్టెమంచం మీద పడుకుంటు అన్నాడు శ్రీనివాస్.

"అవును స్వామీ అవును.భగవంతుడి రచనలో ఇదో భాగం" అన్నది శరద్వతి అతని గుండెలమీద తలపెట్టి.

"నా మునిమనుమడి భార్య గర్భవతి అయింది ఖురేషీ.." మహదానందంగా అన్నాడు ఇసాక్ అల్ హుంజా జా మీర్.

"నిజమా?" ఆశ్చర్యంగా అన్నాడు బద్రుద్దీన్ ఖురేషీ.

"నిజం భయ్యా" సంతోషంగా చెప్పింది హుస్నా మీర్ ఓ లడ్డూ ఖురేషీ చేతిలో పెడుతూ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments